విశాలాంధ్ర కృష్ణా జిల్లా

పోలవరం ఎత్తు తగ్గిస్తే ఊరుకోం

విశాలాంధ్ర-మచిలీపట్నం: సీపీఐ రాష్ట్ర సమితి, రైతు సంఘం పిలుపు మేరకు పోలవరం ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టుగా నిర్ణయించిన రోజున నిర్ణయించిన ఎత్తును తగ్గించరాదని, పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సామూహిక దీక్షలో భాగంగా మచిలీపట్నం ధర్నా చౌక్‌లో సీపీఐ, రైతు సంఘం సంయుక్త అధ్వర్యంలో సోమవారం దీక్ష నిర్వహించారు. కృష్ణాజిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు అనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ దీక్షను ప్రారంభించారు. ఎట్టి పరిస్థితులలోను పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గించరాదని, త్వరలో ప్రాజెక్టు పూర్తిచేసి రైతులను ఆదుకోవాలని బెనర్జీ ప్రభుత్వాన్ని కోరారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి టీ తాతయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, రైతులకు గిట్టుబాటు ధర అందించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆయన దుయ్యబట్టారు. నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టుగా నిర్ణయించిన రోజున 156 అడుగుల ఎత్తు లక్ష 96 వేలకు క్యూసెక్కుల నీరు నిల్వ చేయుటకు అనువుగా నిర్ణయించారని, దానిని ఈరోజు 136 అడుగుల ఎత్తుకు కుదించడం ఏ మాత్రం సబబు కాదన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సర్వం కోల్పోయి భూములు ఇచ్చిన నిర్వాసితులుగా ఉన్న రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి ఆయన అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దగాని సంగీతరావు మాట్లాడుతూ రైతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయం చేయాలని, నిర్వాసితులకు తక్షణమే నష్ట పరిహారం చెల్లించాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తుమ్మ చిన్న కొండయ్య, వి సుబ్రహ్మణ్యేశ్వర రావు, దగాని రాజబాబు, బళ్ల సుబ్బారావు, ఏఐటీయూసీ పట్టణ ఉపాధ్యక్షులు ఒంటెపులి లక్ష్మణరావు(ఓ.ఎల్‌రావు) మహిళా సమైక్య జిల్లాసహాయ కార్యదర్శి ఓడుగు రత్నకుమారి, ఒడుగు చైతన్య కుమార్ పడవ కోటిలింగం సిపిఐ నాయకులు మోదుమూడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్‌సి కల్పించడం అభినందనీయం

విశాలాంధ్ర-గుడివాడ: ఎస్సీలకు అందరితో సమానంగా మత స్వేచ్ఛ కల్పించడం అభినందనీయమని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు డా॥ లింగం జాన్ బెన్నీ అన్నారు. సోమవారం స్థానిక నెహ్రూచౌక్‌లో డా॥ బెన్నీ మాట్లాడుతూ సీఎం జగన్ గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు దళిత క్రైస్తవుల ఉద్దేశించి అసెంబ్లీలో ప్రస్తావించారన్నారు. దళితులు కేవలం చర్చిలకు వెళ్లడం మాత్రాన వారికి ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. సీఎం జగన్ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించడం అభినందనీమన్నారు. రాష్ట్ర ఏఐసీసీ సెక్రెటరీ ముత్యాల జయరాజు, వైసీపీ నాయకులు వెంపటి సైమన్, లింగం శేఖర్‌బాబు, కంటే జయరాజు, మాచర్ల రాజు, కృపాకర్, ప్రభాకర్, రాంబాబు, పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

విశాలాంధ్ర-గుడివాడ: ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య పిలుపు మేరకు సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వర్గీకరన చేయాలని కోరుతూ విన్నతి పత్రాన్ని అందజేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల సుధాకర్ మాట్లాడుతూ ఏపీ షెడ్యూల్ కులాల వర్గీకరణకు బిల్లు ఈ వేసవికాలంలో జరిగే సమావేశాల్లో జస్టిస్ ఉషా మెహరీన్ కమిషన్ ఆధారంగా పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి మాదిగ, మాదిగ ఉప కులాలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు అద్దంకి మాణిక్యాలరావు, ఇంటూరి గజేంద్ర, తాళ్ళూరి ప్రశాంత్ పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశానికి హాజరవ్వండి: ఎంపీడీవో

విశాలాంధ్ర-పెదపారుపూడి: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 3న ఉదయం 10 గంటలకు జరగనున్నది. ఎంపీపీ గోగం సురేశ్ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని, మండలంలోని అధికారులు పూర్తి సమాచారంతో హాజరవ్వాలని ఎంపీడీవో టి. సీత మహాలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రెడ్‌క్రాస్ అధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర-నాగాయలంక: రెడ్‌క్రాస్ నాగాయలంక శాఖ అధ్వర్యంలో సోమవారం వివిధ సేవా కార్యక్రమాలు జరిగాయి. ఆ సంస్థ చైర్మన్ భోగాది శివ విష్ణు, రాష్ట్ర రామ్‌చరణ్ యువశక్తి కృష్ణా కన్వీనర్ యర్రంశెట్టి నాగ పవన్ సంయుక్త ఆధ్వర్యంలో రామ్‌చరణ్ జన్మదినోత్సవ సందర్భంగా నాగాయలంక ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరాన్ని, తలగడదీవి ఉన్నత పాఠశాలకు చెందిన 260మంది విద్యార్థులకు ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని, రేమాలవారి పాలెం ప్రభుత్వ పాఠశాలలో ఉచిత దంత సంరక్షణ శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి భవిరి శంకరనాథ్, రెడ్‌క్రాస్ జిల్లా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సభ్యులు సింహాద్రి కృష్ణప్రసాద్, మునగాల కుటుంబరావు, యర్రంశెట్టి నాగ పవన్, గుడివాడ శేషుబాబు పాల్గొన్నారు.

ఎన్‌పీసీఐ పోర్టల్లో అనుసంధానం చేసుకోండి

విశాలాంధ్ర-మచిలీపట్నం: 2022-2023 నుంచి ఎస్సీ విద్యార్థులకు మంజూరు అయ్యే జగనన్న విద్యాదీవెన నిధులు, ప్రభుత్వము నేరుగా ఎస్సీ విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుందని, దీని కోసం కృష్ణాజిల్లాలో ఉన్న కళాశాలల్లో చదువుకునే ఎస్సీ విద్యార్థులు తమ బ్యాంకు ఖాతాను ఆధార్ నెంబర్‌కు ఎన్ పీసీఐ పోర్టల్‌లో అతి త్వరగా అనుసంధానము చేసుకోవాలని కృష్ణాజిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి కే సరస్వతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ వివరాలను వారి గ్రామ, వార్డు సచివాలయాలలో నిర్ధారణ చేసుకొవాలని సూచించారు. అప్పుడు మాత్రమే విద్యాదీవెన నిధులు బ్యాంకులో పడతాయని పేర్కొన్నారు. జిల్లాలోని కళాశాలల ప్రిన్సిపాళ్లందరూ విద్యార్థులకు ఈ సమాచారం తెలియపరచాలని సూచించారు.

అర్జీలు వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం: పరిష్కారం కోరుతూ సమర్పించిన అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్పందన సమావేశపు మందిరంలో ఆమె జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యల పరిష్కార నిమిత్తం సమర్పించిన అర్జీలను అధికారులతో కలసి స్వీకరించారు. మొత్తంగా 95 అర్జీలు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. డీఅర్వో ఎం. వెంకటేశ్వర్లు, బందరు ఆర్డీఓ ఐ.కిషోర్, కేఆర్ఆర్సీ డిప్యూటీ కలెక్టర్ బి. శివ నారాయణ రెడ్డి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాపీ రాస్తూ పట్టుబడిన విద్యార్థిని

విశాలాంధ్ర-కూచిపూడి: క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్ష సోమవారం నిర్వహించారు. రెండో సంవత్సరం ఎంపీసీ గ్రూప్‌లో ఫిజిక్స్ పరీక్ష కాపీ రాస్తున్న విద్యార్థినిని ఫ్లయింగ్ స్క్వాడ్ పట్టుకున్నారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమవగా సుమారు 10 గంటల 30 నిమిషాల ప్రాంతంలో వై సుజాత (డిప్యూటీ తహసీల్దార్), టీఎస్ఎస్ దేవి (ఫిజికల్ డైరెక్టర్) బృందం కళాశాలకు ఆకస్మికంగా వచ్చి తనిఖీలు నిర్వహించగా ఈ విషయం వెలుగు చూసింది. మాస్‌కాపీ చేస్తున్న విద్యార్థినిగా గుర్తించినట్టు సీఎస్ కే కిరణ్‌కుమార్, డీఓ ఎల్ హరిణ్మయి తెలిపారు. ఈ పరీక్షలకు 224 మందికి ముగ్గురు గైర్హాజరు కావడంతో 221 మంది ఈ పరీక్షలు రాశారు.

పేకాట శిబిరం పై దాడి

విశాలాంధ్ర-వీరులపాడు: జుజ్జూరు గ్రామ శివారులో పేకాట శిబిరంపై సోమవారం దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు వీరులపాడు మండల ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు. జూదరుల నుంచి రూ.2100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

పూర్ణావతి మృతి టీడీపీకి లోటు

విశాలాంధ్ర-కూచిపూడి: రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి కుర్రా నరేంద్ర అత్త, మూలపాడు గ్రామ ప్రముఖులు కోగంటి పూర్ణ చంద్రావతి మృతి టీడీపీకి తీరని లోటని పామర్రు నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త వర్ల కుమార్ రాజా నివాళులర్పించారు. మొవ్వ మండలం మూలపాలెంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు, రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి గుండపనేని ఉమావరప్రసాద్, మచిలీపట్నం పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు నన్నపనేని వీరేంద్ర,మొవ్వ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వర రావు, జిల్లా రైతు నాయకులు తాతినేని పూర్ణచంద్రరావు, వేములపల్లి శ్రీనివాసరావు, చెన్నుపాటి శ్రీధర్ తదితరులు పాల్గొని నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఆమె భర్త కోగంటి రాజారావులను పరామర్శించి ఓదార్చారు.

పీసీపీఎన్‌డీటీ పోస్టర్ల విడుదల

విశాలాంధ్ర-మచిలీపట్నం: జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ ఆదేశానుసారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ జీ గీతాబాయి పర్యవేక్షణలో పీసీపీఎన్‌డీటీ చట్టంపై పోస్టర్లను రూపొందించి, జిల్లాలోని ఐదు డిపోలీ పరిధిలోని పల్లెవెలుగు బస్సులన్నిపై పోస్టర్లను సోమవారం అతికించారు. మచిలీపట్నం డిపో మేనేజర్ టీ పెద్దిరాజు ఆదేశం మేరకు మచిలీపట్నం డిపోలోని పల్లె వెలుగు బస్సులన్నిటిపై ఈ పోస్టర్లను అంటించేందుకు సోమవారం శ్రీకారం చుట్టారు. పీడీడీ జేమ్స్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ కె . కుమార్ స్వామి, కార్యాలయ పర్యవేక్షకుడు టీ. రాము, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది బీ శివసాంబిరెడ్డి, ఆరోగ్య, విద్య, విస్తరణాధికారి, బీ రాజేంద్ర పాల్గొన్నారు.

ఇది మహిళా పక్షపాత ప్రభుత్వం: జోగి



విశాలాంధ్ర-బంటుమిల్లి: ఇది మహిళా పక్షపాత ప్రభుత్వమని, అక్క చెల్లెమ్మలు విద్య, ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారత కల్పించాలని తపిస్తున్న ప్రభుత్వమని, ఇక్కడికి వచ్చిన అక్కచెల్లెమ్మలే ఇందుకు నిదర్శనమని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని పెదతుమ్మిడి జిల్లా పరిషత్ హైస్కులు అవరణలో సోమవారం అందజేశారు. ఎంపిపి వెలివెల చినబాబు ,జడ్పిటిసి మలిశెట్టి వెంకట రమణ, మండల పార్టీ అధ్యక్షులు మలిశెట్టి రాజబాబు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమాని శ్రీనివాసరావు, మల్లేశ్వరం మార్కెట్ యార్డు ఉపాధ్యక్షులు పాలడుగు బాబురావు, వైసీపీ నేతలు మట్ట నాగబాబు, ఎంపీడీఓ జె స్వరభారతి, తహశీల్దారు ఎంసత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ సిద్ధం: ఎస్పీ

విశాలాంధ్ర- మచిలీపట్నం: చట్టపరిధిలో సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని జిల్లా ఎస్పీ పీ జాషువా తెలిపారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలోని స్పందన హాల్లో ఫిర్యాదుదారుల నుంచి స్వయంగా వినతి పత్రాలను స్వీకరించారు. గుడివాడ, పమిడిముక్కల మండలం, అవనిగడ్డ, బంటుమిల్లి పరిసర ప్రాంతాల్లోని అర్జీదారులు ఎస్పీ కార్యాలయానికి చేరుకొని వినతిపత్రాలు అందజేశారు.

తల్లిదండ్రులు కీలకపాత్ర పోషించాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం: సమాజంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టడంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని జాయింట్ కలెక్టర్ డా.అపరాజిత సింగ్ అన్నారు. సోమవారం స్పందన సమావేశపు మందిరంలో కేంద్ర ప్రభుత్వ నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డ్రగ్ డిమాండ్ రిడెక్షన్ పై జాయింట్ కలెక్టర్ జిల్లా అధికారులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, బందరు ఆర్డీఓ ఐ. కిషోర్, కెఆర్ ఆర్ సీ డిప్యూటీ కలెక్టర్ శివనారాయణ రెడ్డి, వికలాంగుల సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ రామ్ కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: వంశీ

విశాలాంధ్ర-గన్నవరం: గ్రామాభివృద్ధే ప్రభుత్వం లక్ష్యం అన్ని ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. సోమవారం గన్నవరం పట్టణంలోని రాయ్‌నగర్ లో రూ.38లక్షలతో బీటీ రోడ్లను రాయ్ నగర్ సోసైటి మాజీ అధ్యక్షులు సీనియర్ కామ్రేడ్ పెద్దు వెంకటరత్నం ప్రారంభించారు. పేదల సంక్షేమం తో పాటు గ్రామ అభిరువృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వంశీ అన్నారు. దేశంలోనే సచివాలయాల వ్యవస్థ ప్రవేశపెట్టి ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంది అన్నారు. చంద్రబాబు ఎన్నిజిమ్మిక్కులు చేసిన ప్రజలు జగన్ వైపు ఉన్నారన్నారు. సొసైటీ అధ్యక్షులు మన్నే సుందరావు, కార్యదర్శి కంభంపాటి వెంకటేశ్వరవు, వై సిపి నాయకులు జడ్పిటిసి సభ్యులు అన్నవరపు ఎల్జిబెత్ రాణి,సర్పంచి నిడమర్తి సౌజన్య, నాగేశ్వరవు,కొల్లి రాజశేఖర్,వార్డు సభ్యులు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మసీదుల నిర్వహణ ఖర్చులు కేటాయించాలి

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం: రంజాన్ సందర్భంగా మసీదులకు నిర్వహణ ఖర్చులు కేటాయించాలని, రాష్ట్రంలో ఆదాయం లేని మసీదులకు ఈద్గాలకు-లైటింగ్ మరమ్మతులు, సున్నం ఖర్చులు కింద 50 వేల రూపాయలు తక్షణమే మంజూరు చేయాలని అహలే సున్నతుల్ జమాత్ రాష్ట్ర కో-కన్వీనర్ జమాత్ అల్తాఫ్ బాబా ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పేద ముస్లింలకు ప్రభుత్వం రంజాన్ మాసం సందర్భంగా గోధుమలు, చక్కెర తదితర నిత్యావసరాలు ఉచితంగా పంపిణి చేయాలని కోరారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

విశాలాంధ్ర-విస్సన్నపేటటౌన్: ప్రతిభావంతులైన విద్యార్థులకు సోమవారం ప్రశంసాపత్రాలు పంపిణీ చేసినట్లు స్థానిక శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపల్ పవన్‌కుమార్ తెలిపారు. ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ (ఐఎన్‌టీఎస్‌ఓ) సంస్థ ఫిబ్రవరి 26న నిర్వహించిన ప్రతిభా పరీక్షల్లో తమ విద్యార్థులు ఉత్తమ స్థానాలు సాధించారన్నారు. 53మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించగా, ఒకరు ద్వితీయస్థానం, తృతీయ, చతుర్థ, పంచమ స్థానాల్లో ఇరువురు చొప్పున నిలిచారని వివరించారు.

నియామక పత్రాల అందజేత

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక): గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించిన నియామక పత్రాలను స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఎస్.డిల్లీరావు సోమవారం 15 మంది అభ్యర్థులకు అందజేశారు. గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, లెక్చరర్ పోస్టులను జౌట్‌సోర్సింగ్‌లో భర్తీ చేయాలని ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని కొండపల్లి, మైలవరం, నందిగామ, విస్సన్నపేట(కొండపర్వ) గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులకు, జగ్గయ్యపేట, విస్సన్నపేట ఆరు గిరిజన గురుకుల బాలుర పాఠశాలతో పాటు విస్సన్నపేట (కొడపర్వ) ప్రతిభా కళాశాలలో 15 మంది ఉపాధ్యాయ, లెక్చరర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. జేసీ ఎస్.నుపూర్ అజయ్, డీఆర్‌వో కే.మోహన్‌కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎం.రుక్మాంగదయ్య పాల్గొన్నారు.

31న మారెమ్మ హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: పుట్రేలలోని మారెమ్మ అమ్మవారి దేవాలయంలో ఈనెల 31వ తేదీన హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు దేవాలయ కార్యనిర్వహణాధికారి వై.వెంకట్రామయ్య తెలిపారు. ఆరోజు ఉదయం దేవాలయ ప్రాంగణంలో చేపట్టనున్న ఈ కార్యక్రమానికి దేవాదాయశాఖ ఉన్నతాధికారులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, సేవాదళ సభ్యులు పాల్గొంటారని ఆయన వివరించారు.

కుటుంబ ఆరోగ్యం పై సర్వే

విశాలాంధ్ర-వీరులపాడు: మండలంలోని పొన్నవరం,నరసింహారావు పాలెం, చెన్నారావు పాలెం గ్రామాల్లో సెంట్రల్ హెల్త్ టీం సోమవారం పర్యటించింది. కేంద్ర ప్రభుత్వం కుటుంబ ఆరోగ్యంపై దేశవ్యాప్తంగా చేస్తున్న సర్వేలో భాగంగా నేషనల్ హెల్త్ ఫ్యామిలీ సర్వే ఆధ్వర్యంలో సిగ్మా రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చే గ్రామాల్లోని ప్రతి ఇంటికి తిరిగి సమాచారం సేకరిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సర్వేలో తెలుసుకున్న అంశాల ఆధారంగా ప్రజలలో నెలకొన్న రక్తహీనత, పోషకాహారం తదితర అంశాలపై ప్రభుత్వం చర్యలు చేపడుతుంది.

47వ డివిజన్ పార్టీ సభ్యులు ఉలపల్లి మృతి

విశాలాంధ్ర-విజయవాడ: కమ్యూనిస్టు పార్టీ విజయవాడ నగర 47వ డివిజన్ పార్టీ సభ్యులు పలపల్లి పద్మనాభం తన నివాసంలో సోమవారం ఆకస్మికంగా మృతి చెందారు. 25 సంవత్సరాలుగా పార్టీ సభ్యులుగా కొనసాగుతున్నారు. వృత్తిరీత్యా మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగి. పాత 32వ డివిజన్ పార్టీ సభ్యులుగా కొనసాగారు. పద్మనాభం మరణ వార్త తెలిసిన వెంటనే సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఆయన నివాసానికి చేరుకుని భౌతికకాయంపై పార్టీ జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు డివి.రమణబాబు, స్థానిక డివిజన్ పార్టీ కార్యదర్శి ఆర్ మైకేల్, ఎస్.నాగేశ్వరరావు, వి.రామారావు, టి.యలమంద, ఎన్.సూరిబాబు, ఎస్.వెంకట నారాయణ, ఆర్.ప్రభుదాస్, జె.రంగరావు, పి.అప్పారావు, పి.మల్లేశ్వరరావు, టి.సన్యాసిరావు, పి.సాంబశివరావు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు రామారావు, వైసీపీ నాయకులు యర్రజర్ల మురళి శంకర్ తదితరులు శ్రద్ధాంజలి ఘటించిన వారిలో ఉన్నారు.

సీపీఐ నిరసన దీక్షలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-విజయవాడ: పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించేందుకు మోదీ ప్రభుత్వం చేసున్న కుట్రలను తిప్పికొట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమంలో భాగంగా మంగళవారం విజయవాడ లెనిన్ సెంటర్‌లో జరిగే నిరసన దీక్షలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావులు సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన దీక్షలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, తదితర రాష్ట్ర, జిల్లా, నగర నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో సకాలంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మదుపులో మహిళలదే పైచేయి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: చేతికొచ్చిన నగదును పొదుపు చేయటంలో మహిళలు ముందంజలో ఉంటారని తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి అన్నారు. విస్సన్నపేట మార్కెట్‌యార్డులో సోమవారం జరిగిన ఆసరా పథకం ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఆయనతోపాటు జడ్పీటీసీ సభ్యుడు బీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి, డీసీసీబీ సభ్యురాలు భూక్యా రాణి, పలువురు స్థానిక నేతలు, తహశీల్దారు కె.లక్ష్మి, ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, ఈవోఆర్డీ ఝాన్సీరాణి, వెలుగు ఏపీఎం జమలయ్య, నరేగా ఏపీవో అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంతో జీవన్మరణ సమస్య: శ్రావణ్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): రాష్ట్రంలో దళితులు, సామాన్యులతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులకు సైతం జగన్ ప్రభుత్వంలో రక్షణ, స్వేచ్ఛ లేకుండా పోయిందని జై భీమ్ భారత్ పార్టీ వ్యవస్థాపకులు, హైకోర్టు న్యాయవాది జడ శ్రావణ్ కుమార్ ఆరోపించారు. సోమవారం గాంధీనగర్‌లోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.జగన్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి జీవన్మరణ సమస్యగా మారిందిని అగ్రహం వ్యక్తం చేశారు. తొండంగిలో మరో దళిత యువకుడు హత్యకు గురవడం కలచివేసిందన్నారు. అధికారం కోసం దళితులను జగన్ పావులుగా వాడుకుంటున్నారన్నారు. దళితుల ఆత్మగౌరవం అడ్డుకుంటే దళితుల సత్తా ఏంటో చూపిస్తాం అన్నారు. అచ్చెన్నది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే అన్నారు.

తాటిబెల్లంతో రక్తహీనతకు చెక్

విశాలాంధ్ర-బంటుమిల్లి: కౌమార బాలికలల్లో రక్తహీనతను నివారించడానికి ప్రస్తుతం అందిస్తున్న ఐరన్ ఫోలిక్ యాసిడ్ టాబ్‌లెట్లకు అదనంగా పాఠశాల విద్యార్థులకు తాటి బెల్లాన్ని ప్రయోగాత్మకంగా పంపిణీచేస్తే మంచిదని ఆరోగ్య శాఖ అధికారిణి దుర్గ మల్లీశ్వరి అన్నారు. కౌమార బాలికల్లో రక్తహీనత నివారణపై బంటుమిల్లి ఎంపీపీ స్కూల్ అవరణలో సోమవారం విద్యార్థులకు అవగహన కార్యక్రమాన్ని ఐసీడీఎస్, వైద్య, మహిళా పోలీసులు కలసి నిర్వహించారు. సాధారణ బెల్లం హైడ్రోజన్ సల్ఫర్‌ల మిశ్రమంతో తయారుచేయడం వల్ల బాలికల ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. తాటి బెల్లంలో ఐరన్ ఫోలిక్ యాసిడ్ అధికంగా ఉండటంతో రక్తహీనతను నివారించేందుకు ఉపయోగపడుతుదన్నారు. వైద్యసిబ్బంది శారదాంబ, సీహెచ్ అరుణకుమారి, మహిళా పోలీ సులు చంద్రభాను, కృష్ణవేణి, పాఠశాల అధ్యాప కురాలు రజని, అంగన్వాడి కార్యకర్తలు ఎస్ కె ఫాతిమున్నీసా, కె రాణి, బి రాజమ్మ, కె కుమారి, కె సుజాత, బి సువర్ణ కుమారి, ఎం డి ముషీరా బేగం, అర్ వి రమణమ్మ పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి

విశాలాంధ్ర-చల్లపల్లి: ప్రభుత్వం, కేడీసీసీ బ్యాంకు సహకారంతో రైతుల సంక్షేమానికి కృషిచేస్తున్నట్లు చల్లపల్లి, మాజేరు సొసైటీల చైర్పర్సన్లు పాగోలు నాగ సీతా రామారావు (ఫణి), శివశంకర్ తెలిపారు. చల్లపల్లి మండలం చల్లపల్లి, మాజేరు సొసైటీల మహాజనసభలు వేర్వేరుగా జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో సొసైటీల సీఈవోలు తోట కృష్ణారావు, ఎస్ఎస్.చక్రపాణి, పర్సన్లు, రైతులు పాల్గొన్నారు.

యానాదులకు చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-పమిడిముక్కల: గురజాడలో నివాసముంటున్న యానాదుల (ఎస్టీ) కుటుంబాలకు నివాసం గృహాల నిర్మాణానికి మొదటి విడతగా ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ సోమవారం చెక్కులు పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ జె.నివాస్ గురజాడ పర్యటన సందర్భంగా యానాదుల కుటుంబ పరిస్థితులు గమనించి అక్కడ ఉన్న 38 కుటుంబాలకు రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, విద్యుత్ సౌకర్యం అందించాలని, నివేశ స్థలాలకు ప్రత్యేకంగా ప్రభుత్వం ఇచ్చే సొమ్ము కాకుండా ఒక్కొక్క కుటుంబానికి అదనంగా రూ.63వేలు ఎస్టీ సంక్షేమం శాఖ నుంచి అందించాలని అధికారులను ఆదేశించారు. ఆ సొమ్ములో మూడోభాగం చెక్కులను పంపిణీ చేశారు. వైసీపీ నేతలు శొంఠి వెంకటేశ్వరరావు, ఏనుగ మస్తాన్‌రావు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామపట్టాభిషేకం

విశాలాంధ్ర-చల్లపల్లి: చల్లపల్లి మండలం మేకావారిపాలెం గ్రామంలోని శ్రీరామాలయంలో శ్రీరామపట్టాభిషేకం వైభవంగా జరిగింది. ఆలయం నిర్మించి పుష్కరకాలం కావటంతో వాస్తుపూజ, ఆయుష్యహెూమం, శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. నలుగురు దంపతులు పీట్లపై కూర్చుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గర్భాలయంలో కొలువైన స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. ఉత్సవ విగ్రహమూర్తులకు విశేష పూజలు జరుపగా, ఆరు గంటలపాటు నిర్విరామంగా శ్రీరామ నామ సంకీర్తన చేశారు. ఈ సందర్భంగా కోలాట ప్రదర్శన జరిగింది. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం పాలకమండలి ఎన్నికలు ప్రశాంతం

విశాలాంధ్ర-కూచిపూడి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం మొవ్వ యూనిట్ ఎన్నికలు సోమవారం సబ్‌ట్రజరీ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఎన్నికలకు అధికారిగా జిల్లా యూనిట్ అధ్యక్షులు కే రాజేంద్రప్రసాద్ వ్యవహరించగా, పరిశీలకునిగా జిల్లా సంఘ కార్యదర్శి సిహెచ్ ఆశీర్వాదం కొనసాగారు. మొవ్వ యూనిట్ (మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండలాలు) అధ్యక్షుడిగా వీవీ కృష్ణారావు (ఘంటసాల), కార్యదర్శిగా పీ సీతారామాచార్యులు (కొడాలి), కోశాధికారిగా వేదాంతం రఘురామ శర్మ (కూచిపూడి), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కోసూరు ఆదినారాయణ రావు (కోసూరు) ఏకగ్రీవంగా ఎన్నికైనారు. అలాగే ఉపాధ్యక్షులుగా సిహెచ్ కృష్ణారావు(పురిటి గడ్డ), జి సుభాష్ చంద్రబోస్ (గోగినేని పాలెం), వై దుర్గారావు (వీరంకిలాకు), కే రూపవాణి (చల్లపల్లి), ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏ వెంకటేశ్వరరావు (కొడాలి), సంయుక్త కార్యదర్శులుగా కే సుబ్బారావు (శ్రీకా కుళం), జి సత్యప్రసాద్ (అగ్నిపర్రు) కే విజయలక్ష్మి (ఘంటసాల), ఎన్నికైనారు. వీరందరినీ మొవ్వ ఉప ఖజానా అధికారి తాతినేని శ్రీనివాసరావు అభినందించారు.

శాస్త్రిదంపతులకు భరతముని అవార్డు

విశాలాంధ్ర-కూచిపూడి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళాపీఠం ప్రధానాచార్యులు, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యులు కళా రత్న డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, టీచింగ్ అసిస్టెంట్ డాక్టర్ వేదాంతం వెంకట దుర్గాభవాని దంపతులను తపోవనం (తుని) శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామి భరతముని అవార్డుతో సత్కరించారు. ఈ విషయాన్ని సన్మాన గ్రహీత డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి సోమవారం విలేకరులకు చెప్పారు. ఈ అవార్డును కాకినాడ శాస్త్రీయ నాట్యాచార్యుల సమాఖ్య నిర్వాహకులు ఆచార్య హరి లోకేష్ శర్మ, ఆనం ప్రసాద్, వరప్రసాద్, టి పురోహిత్ లు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి తొలిసారిగా అందజేశారని పేర్కొన్నారు. 260మంది విద్యార్థిని విద్యార్థులు తమనాస్య ప్రదర్శనలను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్విరామంగా ప్రదర్శించారని వివరించారు. ఈ సందర్భంగా రామలింగ శాస్త్రి కూచిపూడి నాట్యానికి అవసరమైన నాట్య శ్లోకాలను రూపొందించిన గ్రంధాన్ని స్వామీజీ ఆవిష్కరించారు అన్నారు.

చల్లపల్లిని సందర్శించిన మహిళా సర్పంచ్‌లు

విశాలాంధ్ర-చల్లపల్లి: స్వచ్ఛ చల్లపల్లి గ్రామాన్ని అన్నమయ్య జిల్లా మదన పల్లి డివిజన్ లోని మహిళా సర్పంచ్లు స్వచ్ఛంద సంస్థ లతో కలిసి సోమవారం సందర్శించారు. ఫౌండేషన్ ఫర్ ఎకలాజికల్ సెక్యూరిటీ సంస్థ ఆధ్వర్యంలో 13మంది మహిళా సర్పంచ్లు, సంస్థ ప్రతినిధులు శ్రీకాకుళంలోని ఆర్థిక సమతామండలిని, ఆతర్వాత చల్లపల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామంలోని స్వచ్ఛతా కార్యక్రమాలను పరిశీలించారు. ప్రకృతి వనరులను ఎలా రక్షించుకోవాలి, గ్రామాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలనే విష యమై పలు అంశాలపై అధ్యయనం చేసి గ్రామాలను అభివృద్ధి చేసుకునే క్రమంలో ఈ పరిశీలన చేపట్టారు. చల్లపల్లికి ఐకానిక్గా ఉన్న మహాత్మా గాంధీ స్మృతివనాన్ని, చల్లపల్లిలోని సంపద తయారీ కేంద్రాన్ని, స్వచ్ఛ చల్లపల్లి.. మన కోసం మనం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్ను, మినీ గార్డెనింగ్లను సందర్శించారు. స్వచ్ఛ చల్లపల్లి సారధులు డాక్టర్ డీఆర్ కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతిలను కలిసి స్వచ్ఛకార్యక్రమాల అమలుతీరును తెలుసుకున్నారు. చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పి.సుకుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్ సుధాకర్లు చల్లపల్లిలోని స్వచ్ఛతా కార్యక్రమాలు, సంపద తయారీకేంద్రం నిర్వహణ, చెత్త సేకరణ తదితర అంశాల గురించి సర్పంచ్ల బృందానికి, స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులకు తెలియచేశారు.

ఆక్రమిత భూమి ఫెన్సింగ్ తనిఖీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): అంబాపురంలోని యల్లాపు చెరువులో అక్రమంగా ఫెన్సింగ్ ఏర్పాటుపై రెవెన్యూ అధికారులు స్పందించారు. 'దర్గాగా కబ్జా' పేరిట 'విశాలాంధ్ర'లో సోమవారం ప్రచురితమైన కథనంపై తహశీల్దార్ వెంటనే స్పందించి విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఆర్ఐ రామ్‌సింగ్, వీఆర్వో శ్రీనివాసరావు, ఈవో భారతి చెరువు వద్దకు వచ్చి ఫెన్సింగ్‌ను పరిశీలించారు. ఫెన్సింగ్ ఎవరు వేశారనే వివరాలు తెలుసుకుని వారిని కూడా పిలిపించారు. ప్రభుత్వ పోరంబోకు భూమి అయిన చెరువులో ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం నేరం కదా.. అని వారిని ప్రశ్నించారు. అయితే 'మేం చెరువు కబ్జా చేసేందుకు ఫెన్సింగ్ వేయలేదు. ఈ చెరువును బాగు చేసి గ్రామ తాగునీటి అవసరాల కోసం వినియోగించాలని గతంలో పంచాయతీ తీర్మానం చేసింది. భవిష్యత్తులో ఈ చెరువును తాగునీటి అవసరాల కోసం వినియోగిస్తాం. చెరువులో గేదెలు దిగితే తాగునీరు పాడవుతుందనే ముందుజాగ్రత్తతోనే మేం ఫెన్సింగ్ ఏర్పాటు చేశాం. కబ్జా చేసేందుకు కాదు. ఒకవేళ ఎవరైనా చెరువును కబ్జా చేసినా మేం అడ్డుకుంటాం. దానికి మేం బాధ్యత వహిస్తాం' అని చెప్పినట్లు సమాచారం. ఈ మేరకు రాత పూర్వక వాంగ్మూలం కూడా ఇచ్చినట్లు తెలిసింది. చెరువులో వాస్తవ పరిస్థితిని పరిశీలించిన రెవెన్యూ సిబ్బంది పూర్తి వివరాలతో తహశీల్దారుకు నివేదిక అందజేయనున్నట్లు తెలిసింది. మరోవైపు చెరువు బాగు చేయ లేదు.. నీరు నిల్వ చేయలేదు... అప్పుడే గేదెలు రాకుండా ఫెన్సింగ్ వేయ డం ఏంటని అదే గ్రామని చెందిన కొందరు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. చెరువును బాగు చేసి తాగునీటి అవసరాల కోసం అభివృద్ధి చేయడం, ఫెన్సింగ్ ఏర్పాటు అనేది పంచాయతి బాధ్యతని, ప్రైవేటు వ్యక్తులు ఫెన్సింగ్ ఎందుకు వేశారు.. అది కూడా చెరువు మొత్తం కాకుండా కొంత భాగం మాత్రమే ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం దేనికి సంకేతమని ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది నివేదిక ప్రకారమే చర్యలు ఉంటాయని తెలిసింది.

విశాలాంధ్ర ఎన్‌టీఆర్ జిల్లా

శివాలయం నిర్మాణానికి రూ.15వేల విరాళం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు: మండలంలోని వెంగనాయకునిపాలెంలో శివాలయం నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి బొల్లా రామకృష్ణ రూ.15వేలు విరాళంగా అందజేశారు. వెంగనాయకునిపాలెం గ్రామానికి చెందిన సర్పంచ్ భూమిన నరసింహారావు, సురోజు నాగపిచ్చయ్యచారి, లక్ష్మీ నరసయ్య, సూర్యనారాయణ, మేకల సీతారామయ్య, తాళ్లూరు గ్రామ ఉపసర్పంచ్ ప్రసాదపు రమేశ్, మాజీ ఉపసర్పంచ్ సోందుమియా, ప్రసాదపు శ్రీనివాసరావు, బొల్లా నాగేశ్వర రావు, బొల్లా లక్ష్మణరావు, నల్లజాల కోటేశ్వరరావు, బొల్లా వెంకట సాయి పాల్గొన్నారు.

పీఏసీఎస్ నూతన భవనం ప్రారంభం

విశాలాంధ్ర-వత్సవాయి: మండలంలోని భీమవరం గ్రామంలో రూ.39.90 లక్షల వ్యయంతో ది భీమవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన భవనాన్ని కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరావు, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రారంభోత్సవం చేశారు. రైతులు సహకార రుణాలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా నిలబడుతుందని చైర్మన్ అన్నారు. బ్యాంకు చీఫ్ మేనేజర్ వెంకట రామన్, సూపర్వైజర్ శేషగిరిరావు, మాజీ లెఫ్ట్ కెనాస్ చైర్మన్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు గాదెల రామారావు, జెడ్పిటిసి దేవ మణి, మండల ఎంపీపీ చెంబెటి వెంకటేశ్వర్లు, మండల సమైక్య అధ్యక్షురాలు గంగిపోగు శిరీష , ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి, మరో ఎంపీటీసీ చెన్నమ్మ, సర్పంచ్ సుజాత, గుండం రంగారెడ్డి, భీమవరం సొసైటీ చైర్మన్ పెనుగొండ శ్రీనివాస్ రెడ్డి, నియోజవర్గంలో వివిధ గ్రామాల సొసైటీ అధ్యక్షులు రైతు సోదరులు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

షెడ్ నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): శ్రీ దేవి కరుమారి అమ్మన్ శక్తి పీఠం వద్ద జరగనున్న సహస్ర చండీ యాగం ప్రాంగణంలో సోమవారం ఉదయం షెడ్ నిర్మాణానికి లాంఛనంగా భూమిపూజ నిర్వహించారు. ఏప్రిల్ 27 తేదీ నుండి మే 3 తేదీ వరకు శక్తి పీఠం పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ కరుమారి దాసు ఆధ్వర్యంలో సహస్ర చండీ యాగ పూర్వక మహా కుంభాభిషేక మహోత్సవం జరుగనున్న విషయం తెల్సిందే. వేలాదిమంది భక్తులు పాల్గొనే అవకాశం ఉన్న ఈ యాగంలో వందలాది మంది దంపతులు పాల్గొనే విధంగా షెడ్ నిర్మాణం చేపట్టనున్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా ఈ యాగ ప్రాంగణంలో 72 అడుగులు ఎత్తులో మహా చండీ నిలువెత్తు మట్టి విగ్రహం ఏర్పాటు చేస్తున్నారు.ఐతే ప్రాంగణం నైసర్గిక స్వరూపం బట్టి షెడ్ నిర్మాణం చేపట్టిన దరిమిలా సోమవారం సుముహూర్తంలో షెడ్ కోసం భూమిపూజ నిర్వహించామని పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కరుమారి దాసు తెలిపారు.

పథకాలు, సంక్షేమంపై వరల్డ్ బ్యాంక్ టీం ఆరా

విశాలాంధ్ర-పెనమలూరు: ప్రభుత్వం చేపడుతున్న ఆర్బికేల నిర్వహణ, ప్రజల వద్దకే ఆరోగ్య పరిరక్షణ, సంక్షేమ పథకాల అమలు వంటి వాటి గురించి వరల్డ్ బ్యాంక్ టీంకు అధికారులు వివరించారు. మండలంలోని వణుకూరు గ్రామంలో సోమవారం వరల్డ్ బ్యాంక్ కంట్రీ డైరెక్టర్ అగస్టే టానో కౌమే తన బృంద సభ్యులతో కలిసి సందర్శించారు. మొదటగా విలేజ్ కేర్ సెంటర్లను పరిశీలించిన బృందం సెంటర్ నిర్వహణ గురించి తెలుసుకున్నారు ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు 104 వాహనం ఉపయోగాలు ప్రతి 50 కుటుంబాలకు ఒక వాలంటీర్ ద్వారా కుటుంబ ఆరోగ్య పరిరక్షణ గర్భిణీ స్త్రీలకు అందుబాటులో వైద్య సేవలు పోషకాహార పంపిణీ వంటి ప్రభుత్వ పథకాల అమలు ప్రజా సంక్షేమం వంటి వాటిని వరల్డ్ బ్యాంకు బృందానికి అధికారులు వివరించారు ఆంధ్ర రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమం, రైతుల సౌకర్యార్థం నిర్మించిన ఆర్బికే ల నిర్వహణ, ఆర్బికేల ద్వారా రైతులకు భూమి సారాన్ని బట్టి పంటలను నిర్ణయించే పద్ధతులను వివరించారు. ప్రభుత్వ పథకాల అమలుపట్ల సంతృప్తి వ్యక్తం చేసిన బృందం అధికారులకు అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ జే నివాస్ కలెక్టర్ రంజిత్ భాష రాష్ట్ర వ్యవసాయ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ డి ఎం హెచ్ ఓ జి గీతబాయి జిల్లాస్థాయి మండల స్థాయి వివిధ శాఖల అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ సమావేశం జయప్రదం చేయండి

జిల్లా అధ్యక్షుడు లంకా గోవింద రాజులు

విశాలాంధ్ర-జగ్గయ్యపేట: వచ్చేనెల 2న నందిగామలో నిర్వహించనున్న అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు లంకా గోవింద రాజులు కోరారు. సోమవారం స్థానిక జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో ఎదురుగా గల పిల్లల మర్రి వెంకటేశ్వరరావు భవన్‌లో కరపత్రాలు విడుదల చేశారు. గోవిందరాజులు దేశవ్యాప్తంగా నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని మెగా డీఎస్సీ నిర్వహించాలని, పోలీస్ ఎస్ఐ కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీ చేయాలని, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, స్థానిక పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఇవ్వాలని అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'గుట్కా తింటే గుటుక్కుమంటవ్' 'హలో యువత మేలుకో-మత్తు పదార్థాల నుండి నిన్ను నువ్వు కాపాడుకో' అంటూ అనేక రకాల చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ పోటీ పరీక్షల్లో గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపయోగపడే విధంగా అనేక రకాల మోడల్ పరీక్షలు నిర్వహిస్తూ నిరుద్యోగ యువతకు వెన్నుదన్నుగా సమరశీల ఉద్యమాలకు పతాకగా అఖిలభారత యువజన సమైక్య పనిచేస్తోందని, ఈ తరుణంలో ఏప్రిల్ 2న నందిగామ చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో నందిగామ జగ్గయ్యపేట నియోజకవర్గాల జనరల్ బాడీ సమావేశ నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఏఐవైఎఫ్ పట్టణ కార్యనిర్వహక అధ్యక్షులు ఎంద్రపల్లి భాను, నాయకులు జోజి, అంజి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నీలకంఠ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నేత పసుపులేటి మృతి

విశాలాంధ్ర-గంపలగూడెం: భారత కమ్యూనిస్టు పార్టీ గాదే వారి గూడెం గ్రామానికి చెందిన గ్రామ శాఖ సీనియర్ సభ్యుడు పసుపులేటి ఆదినారా యణ (80) సోమవారం తమ స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తూము కృష్ణయ్య మాట్లాడుతూ ఆదికాంతయ్య ఈ ప్రాంత నాయకులతో కలిసి అనేక భూ పోరాటాలు చేశారని ఆయన చేసిన సేవలు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్‌మీరా, సీనియర్ కామ్రేడ్ పసుపులేటి వెంకయ్యతో కలిసి ఆదికాంతయ్య భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఊటుకూరు గ్రామ కార్యదర్శి ఎస్. కొండలరావు, కార్యకర్తలు మల్లాది కృష్ణ, తెలగారపు నాగేశ్వరావు పాల్గొన్నారు.

ఇప్పటికైనా బీజేపీ కళ్లు తెరవాలి: గిడుగు

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాహుల్ గాంధీపై అనర్హత వేటుకు నిరసనగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆధ్వర్యంలో విజయవాడ లెనిన్ సెంటర్ నందు సోమవారం కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఇప్పటికైనా బీజేపీ ప్రభుత్వం కళ్లు తెరవాలని ఆయన హితవు పలికారు. సస్పెండ్ చేసిన రోజునే రాహుల్ గాంధీని క్వార్టర్స్ కూడా ఖాళీ చేయమని చెప్పడం దుర్మార్గపు చర్య అని రుద్రరాజు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్ పాల్గొని సీపీఐ రాష్ట్ర సమితి తరుపున సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ భావజాలంతో బీజేపీ ప్రభుత్వం నడుస్తుందని ఆరోపించారు. స్వాతంత్ర్య పోరాటంలో వీసమెత్తు పాత్ర లేని వారు నేడు దేశాన్ని పాలిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాహుల గాంధీపై అనర్హవేటు వేయటం ద్వారా దేశంలో ప్రజాస్వామ్యానికి ప్రమాదం వాటిల్లిందన్నారు. దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవటం కోసం బీజేపీకి వ్యతిరేకంగా ఐక్యఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర పద్మశ్రీ, నగర అధ్యక్షులు నరహరశెట్టి నరసింహ రావు, లీగల్ సెల్ చైర్మన్ వి.గురునాధం, పి.వై.కిరణ్, గొల్లు కృష్ణ, లామ్ తాంతియా కుమారి, సీనియర్ నాయకులు కొలనుకొండ శివాజీ, ధనికుల మురళీమోహన్, మీసాల రాజేశ్వర రావు, మేడా సురేష్ , సతీష్, ఖాజా మొహినుద్దీన్, వేముల శ్రీనివాస్, పోతరాజు ఏసుదాసు, బైపూడి నాగేశ్వర రావు, డా.జంధ్యాల శాస్త్రి, హరికుమార్ రాజు, అన్సారీ, ఖుర్షీదా, సునీత తదితరులు పాల్గొని కాగడాల ప్రదర్శనను విజయవంతం చేశారు.

తిరుపతమ్మ ఆదాయం రూ.55.55లక్షలు

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ అమ్మవారి హుండీలను దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేర నందిగామ గ్రూప్ టెంపుల్ కార్యనిర్వాహణాధికారి వాసిరెడ్డి భూపాల్ పర్యవేక్షణలో సోమవారం 23 రోజుల హుండీల ఆదాయం 55 లక్షల 55 వేల 807 రూపాయలు వచ్చినట్లు ఈఓ జీవీడీఎన్ లీలా కుమార్, చైర్మన్ ఇంజం కేశవరావు తెలిపారు. అలాగే విదేశీ నగదు 41 డాలర్లు, బంగారం 109 గ్రాములు, వెండి 710 గ్రాములు వచ్చినట్లు తెలిపారు. లెక్కింపులో ఆలయ సిబ్బంది, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, భక్తులు, హోంగార్డ్స్, సేవా సమితి సిబ్బంది పాల్గొన్నారు.

స్పందనలో కలెక్టర్‌కు టీడీపీ కౌన్సిలర్ల ఫిర్యాదు

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం: కొండపల్లి పురపాలికలో ఇటీవల నిర్వహించిన ఆశీలు టెండర్ ను రద్దు చేసి తిరిగి వేలం పాట నిర్వహించాలని కొండపల్లి మున్సిపాలిటీ టీడీపీ కౌన్సిలర్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు టీడీపీ కౌన్సిలర్ లు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. కనీసం కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండా, నోటీసు బోర్డులో పెట్టకుండా ఏకపక్షంగా వేలం పాట నిర్వహించారన్నారు. మున్సిపాలిటీకి రూ.25 లక్షలకు పైగా ఆదాయం లభించే ఆశీలు టెండర్ ను రూ.10.25 లక్షలకు దక్కించుకున్నారంటే ఆదాయానికి గండి కొట్టినట్లేనన్నారు. దీనిని కలెక్టర్ రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో కళాకారులు భాగస్వాములవ్వాలి

విశాలాంధ్ర-విజయవాడ: చిత్రలేఖన కళ ద్వారా సమాజంలోని అనేక అంశాలను సృజనాత్మకంగా ఆవిష్కరించే కళాకారులు ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సెర్ప్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎం.డి.ఇంతియాజ్ పిలుపునిచ్చారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 10వ అఖిల భారత చిల్డ్రన్ అండ్ ఆర్ట్స్ ఎగ్జిబిషన్‌లో భాగంగా డ్రీం ఎస్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్స్ అకాడమి, అనంత్ డైమాండ్స్ సంయుక్తంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీలలో బహుమతులను పొందిన వారి చిత్రలేఖన ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. డ్రీం ఎస్ అండ్ చిల్డ్రన్ అకాడమి వ్యవస్థాపకులు పి.రమేష్, విశ్రాంత ప్రిన్సిపల్ కమీషనర్ కె.అజయ్‌కుమార్, ఐటీ ప్రిన్సిపల్ కమీషనర్ ఎం.ప్రసాద్, అనంత్ డైమాండ్ సేవా విభాగం జాస్తి విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సాగు భూములకు పట్టాలివ్వాలి

ఏపీ వ్యవసాయకార్మిక సంఘం డిమాండ్

విశాలాంధ్ర-ఎ.కొండూరు: మండలంలో ఏళ్ల తరబడి భూమిలేని నిరుపేదలు కుంటో సెంటో బంజరు భూములు అటవీబంజర్లు, ప్రభుత్వ మిగులు భూములు సాగుచేసుకుంటూ తమకుటుంబాలను పోషించుకుంటున్నారని, ఆ భూములకు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కొండూరు తండా సచివాలయం వద్ద సీపీఐ మండల కమిటీ, వ్యవసాయకార్మిక సంఘం అధ్వర్యంలో ధర్నా చేశారు. సంక్షేమ పథకాల మీద ఉన్న ప్రేమ, అభివృద్ధి మీద కేంద్రికరించి పేదలను ఆదుకోవాలని, డబ్బులు పంచినంత మాత్రాన పేదరికం పోదని, వారిజీవితాల్లో వెలుగులు నింపాలంటే భూ పంపిణీ జరగాలని అయన అన్నారు. సీపీఐ మండల కార్యదర్శి మేకల డేవిడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో అర్భాటంగా నవరత్నాల పేరుతో జగనన్న ఇంటి నివేశన స్థలాలు నివాసప్రాంతాలకు దూరంగా పట్టణాల్లో సెంటు, పల్లెల్లో సెంటున్నర ఇచ్చినట్లు రికార్డుల్లో చూపించి చేతులు దులుపుకున్నారే తప్ప ఆచరణలో స్థలాలు కొందరికి పొజిషన్ కూడా చూపించలేదని ఆరోపించారు. పేదలకు ఇచ్చిన నివేశన స్థలాలు అడవులను తలపిస్తున్నాయని ప్రభుత్వం వెంటనే స్పందించి జంగిల్ క్లియర్ చేసి లబ్ధిదారులకు పొజిషన్ చూపించాలని, అలాగే పక్కా గృహాలు మంజూరు చేయాలని, ఇప్పుడు ప్రభుత్వం ఇస్తున్న రూ 1.80 లక్షలు పునాదులకు కూడా సరిపోవని సిమెంట్, ఇనుము, ఇసుక, లేబర్ చార్జీలు విపరీతంగా పెరిగి పోవటంతో కనీసం ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని లేదా ప్రభుత్వమే గృహాలు నిర్మించి ఇవ్వాలని డేవిడ్ డిమాండ్ చేశారు సీపీఐ నాయకులు ఎస్ కె.కరీముల్లా మల్లారి పెదబాబు. బోడ రాములు సాగురైతులు. భూక్యా జగన్. బాణావతు జ్యోతి. బి రమేష్. బి.వెంకటేష్.. ముచ్చింతల వెంకటేశ్వరరావు. భూక్యా తిరపతరావు. దారావతు చిన్న.బి దశరద తదితరులు పాల్గొన్నారు.

30న జింఖానాలో సినీ సంగీత విభావరి

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్: శ్రీరామ నవమి సందర్భంగా ఆంధ్రా జింఖానా క్లబ్ సౌజన్యంతో ఈనెల 30వ తేదీ సాయంత్రం ఆంధ్రా జింఖానా క్లబ్ ప్రాంగణంలో సినీ సంగీత విభావరి ఉంటుందని క్లబ్ కమిటీ సభ్యులు కాకరపర్తి కృష్ణమోహన్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు కళావాహిని, జి ఆర్ కె పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో గాయనీ గాయకులు పలు చిత్రాలలోని భక్తి పాటలు పాడతారని తెలిపారు. సమావేశంలో చింతకాయల చిట్టిబాబు, మద్దెల శ్యాంప్రసాద్, ఉప్పలపాటి గోపాలకృష్ణరాజు, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర-గంపలగూడెం: మామిడి పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వ0 ఎకరాకు 50 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని, ధాన్యం డబ్బులు చెల్లించాలని, 0 వడ్డీ డబ్బులు రైతుల ఖాతాలో జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎన్టీఆర్ జిల్లా రైతు సంఘం కార్యదర్శి పగడాల ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నాడు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఎమ్మార్వో జిట్టా బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల, మామిడి తోటలు దెబ్బతిని మామిడికాయ నాణ్యత దెబ్బతిన్నదని , టన్ను మామిడికాయ గతంలో 70 నుండి 80 వేల రూపాయలు ఉన్నదని, ఇప్పుడు పదివేల నుండి 20 వేల వరకు ఉన్నదని, ఎకరానికి ఒక్కో రైతు 50 వేలు పెట్టుబడి పెట్టాడని, అందు వలన ఎకరా తోటకు 50వేల రూపాయలు రైతుకు నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ అనుబంధ సంఘ నాయకులు జి సీతారాం రెడ్డి, జి వీరభద్రం, జె వెంకటేశ్వరరావు, సిహెచ్ వీరారెడ్డి, ఎం గోపాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు గడువులోగా పరిష్కరించాలి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్: స్పందన అర్జీలు నిర్దేశించిన గడువులోగా ప్రజల సంతృప్తి మేరకు పరిష్కరించాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నగర పాలక సంస్థ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మేయర్, కమిషనర్ సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వీఎంసీ అదనపు కమిషనర్‌లు ఎం.శ్యామల, కేవీ.సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ.రత్నావళి, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ డీ.వెంకటలక్ష్మి, యుసీడీ పీవో శకుంతల, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కేబీఎస్ఎస్.లతా, సెక్రటరీ కే.వసంతలక్ష్మి, ఏడీహెచ్ శ్రీనివాసు, ఈఈలు నారాయణమూర్తి, ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, మేనేజర్ బీ.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

వరల్డ్ యూనివర్సిటీ పోటీలకు సిద్ధార్థ విద్యార్థిని

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: ఈ నెల 13 నుంచి 16 వరకు తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్శిటీ లో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ అథ్లెటిక్స్ చాంపియన్షిప్ లో పాల్గొన్న శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థిని మల్లాల అనూష ట్రిపుల్ జంప్ లో బంగారు పతకాన్ని, లాంగ్ జంప్ లో రజత పతకాన్ని సాధించిందని తద్వారా వరల్డ్ యూనివర్శిటీలో పాల్గొనేందుకు అర్హత సాధించిందని కళాశాల ప్రిన్సి పల్ డాక్టర్ ఎస్ కల్పన తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటుచేసిన అభినందన సభలో కళాశాల డైరెక్టర్ డా. టి. విజయలక్ష్మి , ప్రిన్సిపాల్ ,కన్వీనర్ ఎస్. లలిత ప్రసాద్ పాల్గొని మేనేజ్ మెంట్ వారి తరపున అనూషకు 50,000/- నగదు బహుమతిని అందజేసి సత్కరించారు.

CHANGE OF MOTHER'S NAME

I, EILEEN DSILVA, D/o. VENKATESWARA RAO & CYNHRIA RAO (Old Name) D.No.20-6-82/A IIIrd Line, Ramalingeswar pet, Vijayawada- 520003. AP. Will now be called as EILEEN DSILVA, D/o. VENKATESWARARAO & CYNTHIA RAO (New name).

గ్రామ పంచాయతీ కార్యాలయము - బత్తినపాడు
కంచికచర్ల మండలం, యన్.టి.ఆర్.జిల్లా
టెండర్ ప్రకటన తేది : 27-03-2023

యన్.టి.ఆర్ జిల్లా, కంచికచర్ల మండలం, బత్తినపాడు గ్రామపంచాయతీ పరిధిలో రేటు కాంట్రాక్టు పద్ధతిపై రక్షిత మంచినీటి సరఫరా-01, వీధి దీపాలు రిపేరు పనులకు-01, పారిశుద్ధ్యం పనులకు-01, మొత్తం ముగ్గురు వ్యక్తుల సేవలు వినియోగించుటకు ఆసక్తిగల వారి నుండి సీల్డ్ టెండర్లు పంచాయతీ కార్యదర్శి వారిచే గానీ, వారి అనుమతి పొందిన వారిచే గానీ, ది.31-03-2023వ వ తేదీ మధ్యాహ్నం గం.12.00 గంటల వరకు స్వీకరించబడును. అదేరోజు మధ్యాహ్నం గం.3.00లకు సీల్డ్ టెండర్లు తెరువబడును. టెండర్లు ధరావత్తు చెల్లించి తిరుగు రసీదు జతపరచగలరు. టెండర్ల కాలపరిమితి 01.04.2023 టు 31.03.2024 వరకు అనగా ఒక సంవత్సర కాలానికి మాత్రమే. మిగతా వివరాలు కార్యాలయం పనిచేయు వేళలో తెలుసుకోనగలరు.

వ.నెం	పని వివరములు	కాలము	ధరావత్తు
1	రక్షిత మంచినీటి సరఫరా	ది.1-4-2023 నుండి ది.31-03-2024 వరకు	1000/-
2	వీధిదీపాల రిపేరు పనులు		1000/-
3	పారిశుద్ధ్యం నిర్వహణ		1000/-

గమనిక : గతంలో పనిచేసిన వారికి అనుభవమును బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును.

శ్రీ జంగా సంతోషరావు, సర్పంచ్, బత్తినపాడు
శ్రీమతి సి.హెచ్ వనిత, కార్యదర్శి, బత్తినపాడు

గ్రామ పంచాయతీ కార్యాలయం - మైలవరం
ఆర్.సి.నెం.181/2023 బహిరంగ వేలం ప్రకటన తేది : 27-03-2023

యన్.టి.ఆర్ జిల్లా, మైలవరం గ్రామపంచాయితీ యొక్క షాపింగ్ కాంప్లేక్స్‌లో గల 11 షాపులకు (ఒక్కొక్క షాపుకు విడివిడిగా) ది.31-03-2023వ తేదీ శుక్రవారం ఉదయం 11.00గంటలకు గ్రామపంచాయితీ కార్యాలయము నందు బహిరంగ వేలం 2023-24 సం॥ నుండి 2025-26 సం॥వరకు అనగా 3 సం॥రములు కాలమునకు నిర్వహించబడును. మరియు సులభ కాంప్లేక్స్ ది.01-04-2023 నుండి 31-03-2024 వరకు అనగా 1 సం॥కాలమునకు నిర్వహించబడును. సదరు సులభ కాంప్లేక్స్ పాడుకొన్నవారు పంచాయితీచే నిర్ణయించబడిన యూజర్ చార్జీలు వసూలు చేసుకొని నిర్వహించవలసి యుండును. షాపింగ్ కాంప్లేక్స్ 11, సులభ కాంప్లేక్స్ 1 వేలం పాటలలో పాల్గొనదలచిన వారు ముందుగా ధరవత్తు మొత్తము చెల్లించి వేలం పాట నందు పాల్గొనవలెను. ఇతర వివరములు మరియు షరతులు కార్యాలయము పనివేళలనందు తెలుసుకొనగలరు.

వ.నెం.	షాపు నెంబర్లు	కాలపరిమితి	ధరావత్తు
1.	1	2023-24 సం॥ నుండి 2025-26సం॥వరకు	5,000
2.	2	॥	5,000
3.	3	॥	5,000
4.	4	॥	5,000
5.	5	॥	5,000
6.	6	॥	5,000
7.	7	॥	5,000
8.	8	॥	5,000
9.	9	॥	5,000
10.	10	॥	5,000
11.	11	॥	5,000
12.	సులభకాంప్లేక్స్	2023-24 సం॥ నకు	5,000

కార్యదర్శి వారి నోట్ : 1) గ్రామపంచాయితీకి ఏవిధమైన పన్నులు కాని, బకాయిలు ఉండరాదు. అట్లు ఉన్నవారు వేలం పాటలలో పాల్గొనుటకు అనర్హులు.
2) శ్రీ డివిజన్‌ల పంచాయితీ అధికారి, విజయవాడ వారి కనిష్ఠ ధరకులోబడి వేలంపాట నిర్వహించబడును. 3) పంచాయితీ కార్యదర్శి వారికి సదరు వేలంపాటలు వాయిదా వేయుట మరియు తిరస్కరించుటకు అధికారం కలదు.

జి.ఎం.భార్గవి, సర్పంచ్, మైలవరం గ్రామపంచాయతీ,
ఎం. సాంబశివరావు, కార్యదర్శి, మైలవరం గ్రామపంచాయతీ

గ్రామ పంచాయతీ కార్యాలయము - గని ఆత్కూరు
కంచికచర్ల మండలం, యన్.టి.ఆర్.జిల్లా
టెండర్ ప్రకటన తేది : 27-03-2023

యన్.టి.ఆర్ జిల్లా, కంచికచర్ల మండలం, గని ఆత్కూరు గ్రామపంచాయతీ పరిధిలో రేటు కాంట్రాక్టు పద్ధతిపై రక్షిత మంచినీటి సరఫరా-01, వీధి దీపాలు రిపేరు పనులకు-01, పారిశుద్ధ్యం పనులకు-01, మొత్తం ముగ్గురు వ్యక్తుల సేవలు వినియోగించుటకు ఆసక్తిగల వారి నుండి సీల్డ్ టెండర్లు పంచాయతీ కార్యదర్శి వారిచే గానీ, వారి అనుమతి పొందిన వారిచే గానీ, ది.31-03-2023వ వ తేదీ మధ్యాహ్నం గం.12.00 గంటల వరకు స్వీకరించబడును. అదేరోజు మధ్యాహ్నం గం.3.00లకు సీల్డ్ టెండర్లు తెరువబడును. టెండర్లు ధరావత్తు చెల్లించి తిరుగు రసీదు జతపరచగలరు. టెండర్ల కాలపరిమితి 01.04.2023 టు 31.03.2024 వరకు అనగా ఒక సంవత్సర కాలానికి మాత్రమే. మిగతా వివరాలు కార్యాలయం పనిచేయు వేళలో తెలుసుకోనగలరు.

వ.నెం	పని వివరములు	కాలము	ధరావత్తు
1	రక్షిత మంచినీటి సరఫరా-1	ది.1-4-2023 నుండి ది.31-03-2024 వరకు	1000/-
2	వీధిదీపాల రిపేరు పనులు-1		1000/-
3	పారిశుద్ధ్యం నిర్వహణ-2		2000/-

గమనిక : గతంలో పనిచేసిన వారికి అనుభవమును బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును.

శ్రీ షేక్ ఇబ్రహీం, సర్పంచ్, గని ఆత్కూరు
శ్రీమతి సి.హెచ్ వనిత, కార్యదర్శి, గని ఆత్కూరు

గ్రామ పంచాయతీ కార్యాలయము - కొత్తపేట
కంచికచర్ల మండలం, యన్.టి.ఆర్.జిల్లా
టెండర్ ప్రకటన తేది : 27-03-2023

యన్.టి.ఆర్ జిల్లా, కంచికచర్ల మండలం, కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలో రేటు కాంట్రాక్టు పద్ధతిపై రక్షిత మంచినీటి సరఫరా-01, వీధి దీపాలు రిపేరు పనులకు-01, పారిశుద్ధ్యం పనులకు-01, మొత్తం ముగ్గురు వ్యక్తుల సేవలు వినియోగించుటకు ఆసక్తిగల వారి నుండి సీల్డ్ టెండర్లు పంచాయతీ కార్యదర్శి వారిచే గానీ, వారి అనుమతి పొందిన వారిచే గానీ, ది.31-03-2023వ వ తేదీ మధ్యాహ్నం గం.12.00 గంటల వరకు స్వీకరించబడును. అదేరోజు మధ్యాహ్నం గం.3.00లకు సీల్డ్ టెండర్లు తెరువబడును. టెండర్లు ధరావత్తు చెల్లించి తిరుగు రసీదు జతపరచగలరు. టెండర్ల కాలపరిమితి 01.04.2023 టు 31.03.2024 వరకు అనగా ఒక సంవత్సర కాలానికి మాత్రమే. మిగతా వివరాలు కార్యాలయం పనిచేయు వేళలో తెలుసుకోనగలరు.

వ.నెం	పని వివరములు	కాలము	ధరావత్తు
1	రక్షిత మంచినీటి సరఫరా	ది.1-4-2023 నుండి ది.31-03-2024 వరకు	1000/-
2	వీధిదీపాల రిపేరు పనులు		1000/-
3	పారిశుద్ధ్యం నిర్వహణ		1000/-

గమనిక : గతంలో పనిచేసిన వారికి అనుభవమును బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును.

శ్రీమతి ప్రతిపాటి లక్ష్మి సునీతా, సర్పంచ్, కొత్తపేట
శ్రీమతి సి.హెచ్ వనిత, కార్యదర్శి, కొత్తపేట

104తో గడప వద్దకే వైద్యం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక): ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యతనిచ్చి ప్రతి పేదవానికి మెరుగైన కార్పొరేట్ వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, 104 వాహనాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో గడపవద్దకే వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. జిల్లాకు కేటాయించిన ఏడు నూతన 104 వాహనాలను స్థానిక కలెక్టరేట్ ఆవరణలతో కలెక్టర్, నగర మేయర్ రాయనభాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. డిప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు టీ.శ్రీకాంత్, ఎం.శివ రామకృష్ణ, కే.గీతాంజలిదేవి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, జిల్లా టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ జే.ఉషారాణి, అరబిందో ఫార్మ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు

గుండెపోటుపై అవగాహన

గుండెపోటు లక్షణాలపై ప్రజల్లో అవగాహన కల్పించి ప్రథమ చికిత్స ద్వారా మరణాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. గుండెపోటు మరణాలను నివారించేందుకు తీసుకోవాల్సిన ప్రథమ చికిత్సపై స్థానిక కలెక్టర్ కార్యాలయంలో పముఖ వైద్య నిపుణులు డాక్టర్ పీ.విజయశేఖర్‌తో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీ ఎస్.నుపూర్ అజయ్, డీఆర్‌వో కే.మోహన్‌కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ద్వారావతి ఫౌండేషన్ సేవలు స్ఫూర్తిదాయకం

దానాలన్నింటిలోను అన్నదానం మహా గొప్పదని పేద ప్రజల ఆకలి తీర్చి అండగా నిలుస్తున్న ద్వారావతి ఫౌండేషన్ సేవలను స్వచ్ఛంద సంస్థలు స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు ద్వారావతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం కలెక్టర్ ప్రారంభించారు. ద్వారావతి ఫౌండేషన్ చైర్మన్ జి.సంతోష్ కుమార్ సాయి, కలెక్టరేట్ ఏవో ఇంతియాజ్ పాషా, ద్వారావతి ఫౌండేషన్ ప్రతినిధులు వై.సుధాకర్, టీ.బాలాజీ, డీ.కాసిమ్ పాల్గొన్నారు.

వయ్యారిభామను నివారిద్దాం

జీవకోటి అనారోగ్యానికి, పంటల ఎదుగుదల నివారణకు కారణమవుతున్న పార్థీనియం(వయ్యారి భామ) కలుపు మొక్కలను సమూలంగా నిర్మూలించేందుకు 29వ తేదిన జిల్లా వ్యాప్తంగా నిర్వహించే సామూహిక పార్థీనియం మొక్కల నివారణ కార్యక్రమన్ని జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు పిలుపునిచ్చారు. పార్థీనియం మొక్కల నిర్మూలపై స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించి పార్థీనియం కలుపు మొక్కను నిర్మూలిద్దాం, ఆరోగ్యన్ని సంరక్షిద్దాం, పంటలను పరిరక్షిద్దాం అవగాహన పోస్టర్‌ను విడుదల చేశారు. అధికారులు పాల్గొన్నారు.

కంచికచర్లలో మహిళా మార్ట్ ప్రారంభం

కంచికచర్ల: పట్టణంలో డ్వాక్రా పొదుపు సంఘాల మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జగనన్న మహిళా చేయూత మార్ట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు, జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావుతో సోమవారం కలిసి ప్రారంభించారు. మార్ట్‌ను సందర్శించి, డ్వాక్రా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ మలక్ బషీర్, జడ్పిటిసి వేల్పుల ప్రశాంతి, గ్రామ సర్పంచ్ వేల్పుల సునీత, ఉపసర్పంచ్ వేమా సురేష్ బాబు, ఎమ్మార్వో రాజకుమారి, సొసైటీ అధ్యక్షులు కాలవ పెదబాబు, స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మూడో విడత ఆసరా పంపిణీ

పట్టణంలోని ఓసీ క్లబ్‌లో మండల వెలుగు మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైయస్సార్ ఆసరా మూడో విడత వారోత్సవాలు కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు, జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం పొదుపు సంఘాల మహిళలకు వైయస్సార్ ఆసరా చెక్కును అందజేశారు. డి.ఆర్.డి.ఏ. పిడి శ్రీనివాసరావు, ఎంపీపీ మలక్ బషీర్, జడ్పిటిసి వేల్పుల ప్రశాంతి, గ్రామ సర్పంచ్ వేల్పుల సునీత, ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు, వైస్ ఎంపీపీ వెలగలేటి మాధవి, ఎమ్మార్వో రాజకుమారి, ఏపిఎం భాస్కర్, సొసైటీ అధ్యక్షులు కాలవ పెదబాబు, నాయకులు చింతా రవీంద్ర, స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు .

రంగస్థల వైభవాన్ని చాటిన ఏకపాత్ర, ప్రహసనాలు

విశాలాంధ్ర విజయవాడ కల్చరల్: దృశ్య వేదిక,సుమధుర కళానికేతన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ రంగస్థల దినోత్సవ వేడుకలు సందర్భంగా సోమవారం సాయంత్రం ఘంటసాల సంగీత నృత్య కళాశాలలోని వేదికపై ప్రదర్శితమైన ఏకపాత్ర, ప్రహసనాలు, రంగస్థల పద్యాల కళారూపాలు రంగస్థల వైభవాన్ని చాటుతూ సాగాయి. ఎస్ ఎస్ నారాయణబాబు రచించిన డాక్టర్ సరళాదేవి దర్శకత్వం వహించిన ఇంతేనా ప్రహసనం ప్రదర్శితమైంది. నటీనటులుగా షేక్ పర్వీన్,యు నాగ మణి,జె జయనందిని,ఆర్ అఖిల,ఒ సాత్విక,కె సుప్రియ, టి లోహిత,బి సాహిదీపిక,కె లక్ష్మి,ఎన్ సాయి ధరణి,కె జాహ్నవి లు వారి వారి పాత్రలలో చక్కగా నటించి మెప్పించారు. ద్వితీయ ప్రదర్శనగా ఎ భాస్కరచంద్ర రచించగా ఇ రమేష్ బాబు దర్శకత్వం వహించిన అంతేగా ప్రహసనం ప్రదర్శితమైంది. నటీనటులుగా బొర్రా నరేన్, వెనిగళ్ళ భాస్కర్,ఇవి సాగర్,ఇ రమేష్ బాబు, బాయన శ్రీనివాసరావు,సిహెచ్ అభినయ కార్తీక లు వారి వారి భూమికలను చక్కగా పోషించి అభినందనలందుకున్నారు. తృతీయ ప్రదర్శనగా గురజాడ రచించిన గిరీశం అంతర్వేదన ప్రదర్శన జరిగింది.

ఎక్సెల్‌ప్లాంట్, రిటైనింగ్‌వాల్ పనుల పరిశీలన

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్: సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్, కనకదుర్గ వారధి ప్రక్కన రాణిగారితోట రిటైనింగ్‌వాల్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. తొలత నిర్మాణం పూర్తి అయిన సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్ ఆవరణలోని సీసీ రోడ్డు పనులును పరిశీలించారు. మిగిలిపోయిన బీటీ రోడ్డు పనులు, ప్లాంట్ ఆవరణలోని కొత్త ఆఫీసు బిల్డింగ్ నిర్మాణ పనులు, వాటర్ ఫౌంటెన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. చెత్త వేయింగ్(వే బ్రిడ్జి) మిషన్ క్రింద చెత్త, చెదారం లేకుండా ఎప్పటికప్పుడు ఈ ప్రదేశాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్లాంట్ ఆవరణలోని డ్రైనేజిని పరిశీలించి డ్రైనేజిలో చెత్త చెదారం లేకుండా మురికినిరు సంక్రమంగా ప్రవహించేలా శుభ్రం చేయాలనీ ప్రజా ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్లాంట్ ఆవరణలోకి వచ్చిన చెట్లు కొమ్మలను మిషన్ ద్వారా కట్‌చేయాలన్నారు. అనంతరం కృష్ణానది పరివాహక ప్రాంతమైన కృష్ణలంక రాణిగారితోట, రామలింగేశ్వర నగర్ ప్రాంతాల్లోని అవుట్ ఫాల్ డ్రైన్లు పరిశీలించి కొన్ని అవుట్ ఫాల్ డ్రైన్లు నదిలో కలవకుండా చూడాలని అధికారులకు సూచించారు. రిటైనింగ్ వాల్ వద్ద ఏర్పాటు చేస్తున్న రిటైనింగ్ బ్యూటిఫికేషన్ పార్కు పనులను త్వరగా ప్రారంభించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో వీఎంసీ అదనపు కమీషనర్ కేవీ.సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, ఈఈలు వీ.శ్రీనివాస్, చంద్రశేఖర్, ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఇక్బాల్ హుస్సేన్ పాల్గొన్నారు.

వయ్యారి భామ నివారణకు కృషి చేయాలి: రాయన

జంతు జీవజాలానికి ప్రమాదకరమైన వయ్యారిబామ కలుపు మొక్కను సమూలంగా నాశనం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నగర పాలక సంస్థ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. వయ్యారిబామ కలుపుమొక్క నివారణలో భాగంగా సోమవారం నగర పాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో వయ్యారిభామ కలుపు మొక్క నిర్మూలన అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వీఎంసీ కార్యాలయంలోని పార్కు, నగరంలోని కాలువగట్లు వెంబడి ఉన్న వయ్యారిభామ కలుపు మొక్కలు, పిచ్చి మొక్కలను ఉద్యానవన శాఖ సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. అదనపు కమిషనర్‌లు ఎం.శ్యామల, కేవీ.సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ.రత్నావళి, యుసీడీ పీవో శకుంతల, సెక్రటరీ కే.వసంతలక్ష్మి, ఏడీహెచ్ శ్రీనివాసు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

విజయవాడ డివిజన్ సరకు రవాణా ఆదాయం రూ.5,244.34కోట్లు

విశాలాంధ్ర,విజయవాడ(గాంధీనగర్): విజయవాడ డివిజన్ ప్రస్తుత ఆర్థిక 2022-23లో రూ.5244.34 కోట్ల అత్యధిక స్థూల ఆదాయాలను సాధించింది.ఇది 2018-19లో నమోదైన రూ.5136.44 కోట్ల వార్షిక సరకు రవాణా ఆదాయాన్ని అధిగమించింది. ఈ నెల 21 నాటికి డివిజన్ రూ.5157.58 కోట్లు, 2022-23 ఆర్థిక సంవత్సరం ముగింపు కంటే 10 రోజుల ముందుగానే చేరుకుంది. ఈనెలాఖరు నాటికి రూ.5300 కోట్లను దాటుతుంది.డివిజన్ మునుపటి ఆదాయ రికార్డులను తారుమారు చేయడమే కాకుండా ఇటీవల సవరించిన వార్షిక లోడింగ్, 33 మిలియన్ టన్నుల సరుకు రవాణా ఆదాయ లక్ష్యాలను, రూ. సులభంగా వరుసగా 3850 కోట్లు. ఈనెల 26 వరకు వస్తువుల ఆదాయం రూ. 3866. 49 కోట్లు. ప్రయాణీకుల ఆదాయం రూ. 1225 కోట్లు ఇది గత సంవత్సరం ఆదాయాలతో పోలిస్తే 75% ఎక్కువ. వివిధ విభాగాల నుండి సరుకు రవాణా వ్యాపారం నుండి 74%, ప్రయాణీకుల వ్యాపారం నుండి 23%, ఇతర కోచింగ్ ఆదాయాల నుండి 1.7%,సబ్డ్రీస్ నుండి 1.3% ఉన్నాయి. రెండు ప్రధాన ఓడరేవులు కృష్ణపట్నం,కాకినాడ పోర్ట్ రూ.1868 కోట్లు మరియు రూ. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వరుసగా 1205 కోట్లు.విజయవాడ డివిజన్ టిక్కెట్ చెకింగ్, పార్శిల్స్,నాన్ ఫేర్ రెవిన్యూ,కమర్షియల్ ఆస్తుల ఈ-వేలం వంటి మిగిలిన రంగాలలో కూడా అనూహ్యంగా బాగా పనిచేసింది.ఈ సంవత్సరం తేదీ నాటికి డివిజన్ రూ. 58.5 కోట్ల టిక్కెట్ చెకింగ్ ఆదాయాన్ని అత్యధికంగా సాధించింది, ఇది మునుపటి ఉత్తమమైన రూ. 2019-20లో 48.2 కోట్లు.ఎఫ్‌వై 2022-23లో విజయవాడ డివిజన్ వివిధ ఎన్ఎఫ్ఆర్ పాలసీల కింద మొత్తం 16 కాంట్రాక్టులను రూ.9.25 కోట్ల కాంట్రాక్ట్ విలువకు అందజేసింది,2021-22లో అందించిన కాంట్రాక్ట్‌ల నుండి మొత్తం కాంట్రాక్ట్ విలువ రూ.2.45 కోట్లుగా ఉంది. ఐఆర్ఈపిఎస్ ప్లాట్‌ఫారమ్‌లో కొత్త ఆటగాళ్లను నమోదు చేయడం ద్వారా మరియు తద్వారా పోటీని పెంచడం ద్వారా ఈ-వేలాన్ని అమలు చేయడంలో డివిజన్ విజయవంతమైంది, ఫలితంగా మరిన్ని వాణిజ్య ఆస్తులను పారదర్శకంగా అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా డిఆర్ఎం శివేంద్ర మోహన్ సీనియర్ డీసీఎం వావిలపల్లిని రాంబాబును,సీనియర్ డిఒఎమ్ డి.నరేంద్ర వర్మ, ఇతర వాణిజ్య,ఆపరేటింగ్ విభాగాల సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

విశాలాంధ్ర-తిరువూరు: మండలంలోని రోలు పడి గ్రామ సచివాలయంలో వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఎక్కడో దూరంగా ఉన్న నగరాలు, పట్టణాలకు వెళ్లి డబ్బులు ఖర్చు చేయాల్సిన అవసరం లేదని, మీ గ్రామాలలోనే, మీ సచివాలయం వద్దకు వచ్చి పరీక్షలు నిర్వహించి, ఈ పథకం కింద నేత్ర సంబంధిత ఇబ్బందులు ఉన్న వారిని గుర్తించి, ఉచితంగా కళ్ల జోళ్లు, అవసరమైన వైద్య సేవలు ఇంటి వద్దకే వచ్చి అందజేస్తామని ఆప్తమాలజిస్టు డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ శ్రీమతి ముండ్లపాటి కాంతమ్మ, స్టేట్ సోషల్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్ బండి సుజాత, ముష్టికుంట్ల పీఏసీఎస్ అధ్యక్షులు బండి రవి కుమార్, వైఎస్సార్సీపీ నాయకులు ముండ్లపాటి వేంకట రత్నం, పంచాయతీ సెక్రటరీ ధనలక్ష్మి, సచివాలయం సిబ్బంది, హెల్త్ సిబ్బంది, లంటీర్స్ పాల్గొన్నారు.

అసమర్థ పాలనకు నిదర్శనం

విశాలాంధ్ర -భీమవరం: తిరుమల పవిత్ర పుణ్యక్షేత్రంలో టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి నుండి గంజాయి పట్టుబడడం మత్తాంధ్రప్రదేశ్‌గా జగన్ పరిపాలన మారిందని పశ్చిమగోదావరిజిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి వ్యాఖ్యానించారు. సోమవారం ఆమె భీమవరంలో పత్రికా ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ ధూమపానం మద్యపానం నిషేధమైన తిరుమల కొండపై గంజాయి ఇతర మత్తు పదార్థాల విక్రయిస్తున్నందున జగన్ అసమర్థ పాలనకు నిదర్శనమని విమర్శించారు. జగన్ సొంత బంధువులతో నిర్వహిస్తున్న టిటిడి పాలకమండలి ఆధ్వర్యంలో మత్తు,మద్యం బాబులకు నిలయంగా మారిందని జాతీయ నేరవిభాగాలు చేపట్టిన సర్వేలో ఆంధ్రప్రదేశ్లో మద్యం మత్తు పదార్థాలతో యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని నివేదిక ఇవ్వటం వాస్తవం కాదా అని ఆమె ప్రశ్నించారు. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ అంటే దేశానికి అన్నాన్ని అందించే అన్నపూర్ణ రాష్ట్రంగా ఉండేదని ఇప్పుడు మత్తు పదార్థాలకు కేంద్రంగా నిలిచిందని చెడ్డపేరు వస్తుందని తెలిపారు.అప్పుల ఊబిలో కూరికపోయిన జగన్ ప్రభుత్వం చేస్తున్న మద్యం వ్యాపార ఆదాయం ఎక్కడికి పోతుందని కనీసం ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకు మద్యం ఆదాయం సరిపోదా అని విమర్శించారు.

29న మార్టేరులో కిసాన్ మేళా

విశాలాంధ్ర- పెనుమంట్ర: మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో 29వ తేదీన కిసాన్ మేళా నిర్వహిస్తున్నామని సంస్థ పరిశోధన సహాయ సంచాలకులు (ఏ డి ఆర్) డాక్టర్ టి. శ్రీనివాస్ తెలిపారు. కిసాన్ మేళాలో భాగంగా పరిశోధన స్థానం అభివృద్ధి పరచిన నూతన వంగడాలు, ఇతర సాంకేతిక పద్ధతుల ప్రదర్శనతో పాటు క్షేత్ర సందర్శన, రైతు - శాస్త్రవేత్తల ముఖాముఖిలవంటి కార్య క్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతినిధులు, రైతులు పాల్గొంటారని శ్రీనివాస్ తెలిపారు.కాగా కిసాన్ మేళాను పురస్కరించుకొని సోమవారం శాస్త్రవేత్తలతో ఏడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ రూపొందించిన వరి వంగడాలు, నీటి ఎద్దడి, మంచు అధికంగా ఉన్నా అధిక దిగుబడును ఇస్తున్నాయని రైతులు చెబుతున్నారన్నారు.

మల్టీ డిసిప్లినరీ కోర్సులదే ప్రధాన భూమిక

ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతి రాజు

విశాలాంధ్ర-భీమవరం: శాస్త్ర పరిశోధనా రంగాల్లో మల్టీ డిసిప్లినరీ కోర్సులు ప్రధాన భూమిక పోషిస్తున్నాయని విద్యార్థులు కోర్ గ్రూపులను ఎంపిక చేసుకోవాలని ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతి రాజు విద్యార్థులకు సూచించారు. కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగిన సంకేత జాతీయస్థాయి విద్యార్థి సింపోజియం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇన్‌చార్జి మెకానికల్ హెడ్ డాక్టర్ కె.సురేష్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారత అంతరిక్ష పరిశోధనలలో గాని, రక్షణ రంగంలో పలు వినూత్న పరికరాల రూపకల్పనలోను సివిల్ మెకానికల్ ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయన్నారు. ప్రపంచం గర్వించదగ్గ స్థాయిలో ఇస్రో నిర్వహిస్తున్న రాకెట్ ప్రయోగ కేంద్రాల్లో ఇంజనీరింగ్ గ్రూప్ నిపుణులు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఆదివారం ఒక ప్రయోగ వేదిక నుండి 36 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపించిన ఘనత భారతీయ శాస్త్రవేత్తలదన్నారు. ఈ నేపథ్యంలో విద్యా రంగంలో వస్తున్న మార్పుల్లో భాగంగా ప్రతి విద్యార్థి మల్టీ డిస్నేనరీ కోర్సుల్లో ప్రావీణ్యం సంపాదించాలని ఆయన నొక్కి చెప్పారు. కార్యక్రమంలో భాగంగా రెండు రోజులపాటు జరిగిన పోటీల్లో విజేతలకు ప్రిన్సిపల్ చేతుల మీదుగా నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో సంకేత కన్వీనర్ డాక్టర్ సిహెచ్.రామ్ బద్రిరాజు, పలు విభాగాల హెచ్‌ఓడిలు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : మోటార్ సైకిల్‌ను తప్పించబోయి డివైడర్‌ను ఢీకొన్న స్కూల్ పిల్లల ఆటో తృటిలో పెను ప్రమాదం తప్పింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం గొల్లలకోడేరు, మహాదేవ పట్నం పాలకోడేరు చెందిన 15 మంది విద్యార్థులను ఎక్కించుకొని భీమవరం ఓ ప్రైవేటు స్కూల్ కి వెళుతుండగా దుర్గా పురం సమీపంలో మోటార్ సైకిల్‌ను తప్పించబోయి ఆటో డివైడర్‌ను ఢీకొంది. దీనిలోని 8 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలు కాగా వీరిని భీమవరంలో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. వీరిలో నలుగురికి ఆపరేషన్లు చేయాల్సి ఉండగా మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. వీరితోపాటు ఆటో డ్రైవర్ కి స్వలప్ప గాయాలయ్యాయి. వీరంతా 4వ,8వ తరగతి విద్యార్థులు. సంఘటన తెలుసుకున్న డీఎస్పీ శ్రీనాథ్ ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. జిల్లా ఎస్పి యు. రవి ప్రకాష్, మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు, ఆర్‌డిఓ దాసిరాజు,లు ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించి విద్యార్థులకు ధైర్యం చెప్పారు.

'ఆసరా' ఆర్థికంగా ఉపయోగపడుతుంది

విశాలాంధ్ర-రెడ్డిగూడెం: వైఎస్సార్ అసరా పథకం మహిళలకు అర్థిక చేయూతనిస్తుందని మైలవరం శాసన సభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. వైఎస్సార్ అసరా ఉత్సవాలలో భాగంగా రెడ్డిగూడెంలో మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రెడ్డిగూడెం మండలంలో 1004 పొదుపు సంఘాల అక్కా చెల్లెమ్మలకు రూ. 8,74,22,933ల మూడవ విడత నిధులను తాజాగా విడుదల చేసినట్లు స్పష్టం చేశారు. మూడో విడతల్లో ఒక్క రెడ్డిగూడెంమండలంలో రూ. 26.22కోట్లు రుణమాఫీ జరిగిందన్నారు. మహిళ సాధికారిత లక్ష్యంగా నవరత్నాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. వీటిలో ముఖ్యంగా అసరా, చేయూత, సున్నావడ్డి పథకాలు మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, జడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి, ఎంపీపీ రామినేని దేవి ప్రవణ్య, వైస్ ఎంపీపీలు చాట్ల రాబర్టు, పాటిబండ్ల శ్రీనివాసరావు, సర్పంచ్ మల్లాది రాణీ, మండల వైసీపీ అధ్యక్షులు బలగాని తిరుపతిరావు, సచివాలయాల కన్వీనర్ల సంఘం కో ఆర్డినేటర్ భరత్‌కుమార్‌రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

గొల్లపల్లి హైస్కూల్లో పోషణ్ అభియాన్ సంబరాలు

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: మండలంలోని శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగనవాడి కార్యకర్తలు అభియాన్ సంబరాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థులకు పోషకాహారంపై వక్తృత్వ వ్యాసరసర పోటీ నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి ధనలక్ష్మి , ద్వితీయ బహుమతి మనోహర్, తృతీయ బహుమతి అరుణ పొందారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మ, ప్రవీణ్, మనోహరం, సుశీల కుమారి, మల్లీశ్వరి, అంగన్వాడి కార్యకర్తలు రోజా, జయమణి, కుసుమకుమారి, దుర్గ పాల్గొన్నారు.

నూతన ఐటిఐ కళాశాల భవనం ప్రారంభం

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం చేబ్రోలు గ్రామంలో నూతన ఐటిఐ కళాశాల భవనాన్ని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజ నేయులు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల అధినేత అల్లాడి శ్రీనివాస్ (వాసు) బొమ్మిడి అప్పారావు, రాంధే రాజారావు, నెక్కల పూడి వీర వెంకట సత్యన్నారాయణ, పొన్నం బుజ్జి, పొన్నం ప్రభాకర్, అల్లాడి గంగాధర్, పొన్నం ప్రసాద్, దూసనపూడి పుల్లయ్య నాయుడు, కరణం పెద్దిరాజు పాల్గొన్నారు.

దాళ్వా వరి కోతలు ప్రారంభం

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండ లంలో సోమవారం దాళ్వా వరి కోతలు ప్రారంభమయ్యాయి. జాతీయ రహదారి వెల్లమెల్లికి పక్కనున్న మెట్ట ప్రాంతంలో వరి చేలను వరి కోత యంత్రాలతో కోస్తున్నారు. మెట్ట ప్రాంతంలో వరి చేలు కోత దశలో ఉన్నాయి. డెల్టా ప్రాంతంలో కాలవ కింద ఉన్న వరి చేలు పది రోజుల్లో కోతలకు వస్తాయని రైతులంటున్నారు. దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని రైతులంటున్నారు. దాళ్వా కోతలు ప్రారంభమయ్యాయని ఉంగుటూరు మండల వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్ తెలిపారు.

వైభవంగా సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం కంసాలగుంటలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సమరసత సేవా ఫౌండేషన్ వారి ఆర్థిక సహాయంతో సీతా రామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సోమవారం ఉదయం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ బాబ్జి, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు సోదరుడు చిన్నబాబు, మండల వైసీపీ కన్వీనర్ మరడ వెంకట మంగారావు, ఏఎంసీ చైర్మన్ మరడ రమావతి, సర్పంచులు తమ్మిన శ్రీనివాస్, మిద్దె సత్యవతి వెంకటేశ్వరరావు, ఉంగుటూరు ఎంపీటీసీ సభ్యుడు డాక్టర్ పెనుగొండ బాలకృష్ణ, పి బాబ్జి, మానుకొండ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-ముదినేపల్లి : మండలంలోని చేవూరు గరువు సి.ఎస్.ఐ చర్చి నిర్మాణానికి తెలుగుదేశం పార్టీ యువ నాయకులు కొడాలి వినోద్ రూ.30 వేలు, బొమ్మనంపాడు లోని రామాల యం పున ప్రతిష్ట కార్యక్రమా నికి రూ.15 వేలు విరాళాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు కత్తి సుధాకర్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పంతగాని సురేష్, సర్పంచ్ జాస్తి రాజా, ఉప్పల ఫణి కుమార్ , ఎర్రా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందుల దుకాణాలు ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-ముసునూరు: ఎరువులు,పురుగుమందులు ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పి ధరలకు అమ్మాలని ఏడిఏ వెంకటమణీ అన్నారు.సోమవారం మండలంలోని ముసునూరు,చెక్కపల్లి గ్రామాల్లో వున్న క్రిమిసంహారక మందులు,రసాయనిక ఎరువుల షాపులను ఆకస్మిక తనిఖీ చేశారు. వ్యవసాయ పంటలకు ఉపయోగించే ఎరువుల ధరలు అధిక రేటులకు అమ్మిన్నట్లేయితే వారి పై కఠినమైన చర్యలు తీసుకుంటామని మండలంలోని అన్ని షాపుల యాజమానులకు హెచ్చరికలు జారీ చేశారు. కొన్ని షాపుల్లో నిల్వ వున్న సరుకును పరిశీలించి ,వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తనిఖీలో మండల వ్యవసాయాధికారి సిహెచ్ శ్రీనివాసరావు, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

ఆకుకూరలతో మంచి ఆరోగ్యం

విశాలాంధ్ర - కలిదిండి: మనం తీసుకునే ఆహారంలో ఆకుకూరలతో కూడిన ఆహారం తీసుకుంటే మంచి ఆరోగ్యంతో జీవించవచ్చునని ఎంపీటీసీ నీలి సుమన్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ పట్వాడ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ప్రసాద్, అంగన్వాడి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధితో కుటుంబాల అభివృద్ధి

విశాలాంధ్ర-ముదినేపల్లి : మహిళలు అభివృద్ధి చెందిన నాడే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రభుత్వం 3వ విడత ఆసరా పంపిణీ ఉత్సవాల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముదినేపల్లి మండలంలో రూ 11 కోట్ల 77 లక్షల 72 వేల 500లు నమూనా చెక్కును మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు సీఎం జగనన్న ఇచ్చిన హామీలు అమలు చేస్తుండగా అందరూ మద్దతుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ఎంపీడీవో పి. మల్లేశ్వరి, ఎమ్మార్వో కె శ్రీనివాస్ , జడ్పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ బిక్షాలు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా బిల్లు అభినందనీయం

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇచ్చే దిశగా అసెంబ్లీలో బిల్లు ప్రవేశ పెట్టడం అభినందనీయమని ఏలూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ చైర్మన్ ఎలమంచిలి ప్రవీణ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపాదించిన దళిత క్రిస్టియన్స్ కు ఎస్సి హోదా సంబంధించిన బిల్లు ఒక చారిత్రాత్మక నిర్ణయం అన్నారు.శాసనసభ మొత్తం ఏకగ్రీవంగా ఆమోదించడం పట్ల కౌన్సిల్‌కు ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ ధన్యవాదాలు తెలియ చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు బిషప్ బాలరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిషప్ వానాల డేవిడ్ రాజు, బిషప్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఏలూరు జిల్లా గౌరవ అధ్యక్షులు బిషప్ బోడా జాషువా, ప్రెసిడెంట్ బిషప్ జీవరత్నం , వైస్ ప్రెసిడెంట్ బిషప్ తోట డేవిడ్, సెక్రటరీ బిషప్ తానుకొండ జాన్సన్, జాయింట్ సెక్రటరీ బిషప్ దోమతోటిదేవదాసు, వర్కింగ్ ప్రెసిడెంట్ బిషప్ తాణంకి.సుధాకర్ ,ట్రెజరర్ బిషప్ తలారి సూర్యప్రకాష్, లీగల్ అడ్వైజర్ బిషప్ అర్ పి. రాజు, జిల్లా యాక్షన్ కమిటీ లీడర్ బిషప్ టి. దొరమామిడి పాల్, జిల్లా కొఆర్డినేటర్ నాగబుజ్జి, కమిటీ మెంబర్లు, ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.